

ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా

సోమవారం 08 జూన్ 2026 పేజీలు : 8


## ముస్సోరీ ఎల్‌బీఎస్ఎన్ఏఏ 'గుడ్ గవర్నెన్స్'

## ఎంపికైన రీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్ బ్యూరో, విజన్ ఆంధ్ర): ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలో ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ పరిపాలన అకాడమీ (ాదీూచీూూా) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక ఉన్నత స్థాయి శిక్షణా కార్యక్రమానికి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఐఏఎస్ ఎంపికయ్యారు.జూన్ 8 నుంచి 13 వరకు వారం రోజుల పాటు జరిగే "గుడ్ గవర్నెన్స్ ఫర్ ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్" కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. క్షేత్రస్థాయి పరిపాలనలో ఉత్తమ విధానాలు, పారదర్శకత, ప్రజా సేవల మెరుగుదల, వేగవంతమైన సేవల అందజేత, పరిపాలనా సంస్కరణలపై ఈ కార్యక్రమంలో ప్రత్యేక శిక్షణ అందించనున్నారు.




## బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం

# నేరం

### బాల కార్మికులు కనిపిస్తే వెంటనే 1098కు ఫోన్

కరీంనగర్ బ్యూరో, విజన్ ఆంధ్ర): కరీంనగర్ పట్టణంలోని ఎ-వన్ చికెన్ సెంటర్‌లో బాల కార్మికులు పనిచేస్తున్నారని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉచిత సేవకు సమాచారం అందింది. వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కోఆర్డినేటర్ శ్రీ సంపత్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు, టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీ సృజన్ రెడ్డి సహకారంతో డీసీపీవో శ్రీమతి పర్వీన్, చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ శ్రీ సుందరగిరి సాయి కిరణ్ గౌడ్, పోలీస్ స్పెషల్ టీమ్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంబంధిత షాపును సందర్శించారు. ఈ సందర్భంగా యజమానికి బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని హెచ్చరించి, కౌన్సిలింగ్ నిర్వహించారు. బాలుడిని వెంటనే పాఠశాలలో చేర్పించాలని సూచిస్తూ వార్నింగ్ ఇచ్చారు.అధికారులు మాట్లాడుతూ, బాల కార్మికులు ఎక్కడైనా కనిపించినా లేదా బాలల హక్కులకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు

## కరీంనగర్ పీఎంజే జువెలరీ

# దోపిడీ..

### ముగ్గురు నిందితులు జైలుకు తరలింపు




కరీంనగర్ బ్యూరో, విజన్ ఆంధ్ర):

కరీంనగర్ పీఎంజే జువెలరీ షాపు దోపిడీ కేసులో నిందితుల పోలీస్ కస్టడీ ముగిసింది. 4 రోజుల విచారణ అనంతరం నిందితులు సుబోధ్ సింగ్, రఘునాథ్ కర్మాకర్, రవీశ్ కుమార్లను పోలీసులు తిరిగి జైలుకు తరలించారు. విచారణలో కీలక ఆయుధాలు, మొబైల్ స్వాధీనం చేసుకున్నప్పటికీ, దోపిడీ సొత్తు ఆచూకీపై నిందితులు విరుద్ధ వాంగ్మూలాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో వారిని మళ్లీ కస్టడీకి కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. విచారణలో ఇచ్చిన సమాచారం మేరకు వెలిచాల బైపాస్ రోడ్ వద్ద గల చెట్ల పొదలలో దాచి ఉంచిన, నేరానికి ఉపయోగించిన రెండు (02) పిస్టల్స్‌ను, ఫోన్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### పరారీలో ఉన్న మరో కీలక నిందితుడి అరెస్ట్:

ఈ కేసులో పరారీలో ఉన్న మిగతా నిందితులను పట్టుకోవడానికి పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పోలీస్ బృందం ఒక భారీ విజయాన్ని సాధించింది.ఈ నెల 4న బీహార్ రాష్ట్రం, పాట్నా జిల్లాలోని సలింపూర్‌లో ఏ -10 నిందితుడైన అమర్‌సింగ్ అలియాస్ పహిల్వాన్ అలియాస్ అమరేంద్ర కుమార్ సింగ్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. ?ఈ కేసులోని మిగిలిన పరారీ నిందితుల కోసం గాలింపు చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయని సీపీ గౌష్ ఆలం తెలిపారు



# ఆర్మీ ఉద్యోగాలకు ఢిల్లీ డిఫెన్స్ విద్యార్థులు ఎంపిక..!



కొత్తపల్లి జూన్ 07, విజన్ ఆంధ్ర :
కరీంనగర్ రేకుర్తిలోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీకి చెందిన 193 మంది విద్యార్థులు ఇండియన్ ఆర్మీలో ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉందని ఆ అకాడమీ చైర్మన్ కొత్త సతీశ్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ జూనియర్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా సతీశ్ రెడ్డి మాట్లాడుతూ గత నెలలో వెలువడిన ఇండియన్ ఆర్మీ ఫలితాల్లో తమ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు ఇండియన్ ఆర్మీ (జీడీ)లో 157 మంది టెక్నీకల్లో 17 మంది ట్రేడ్మేన్ లుగా 14 మంది క్లార్క్ గా ఒకరు ఇండియన్ ఏయిర్ ఫోర్స్ లో నలుగురు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. తమ అకాడమీకీ చెందిన విద్యార్థులు ప్రతి నోటిఫికేషన్ లో పాల్గొని అత్యధిక ఉద్యాగాలు సాధిస్తూ తెలంగాణలోనే ప్రథమ స్థానంలో నిలుపడం చాలా సంతోషంగా ఉందన్నారు. మారుతున్న అభ్యర్థుల ఎంపిక విధానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ లక్ష్యాలపై దృష్టి పెట్టేలా వాటి సాధనకై నిరంతరం కృషి చేసేలా ప్రోత్సహిస్తూ వారి పరీక్షలకి అనుగుణంగా శారీరక, మానసిక అభ్యాసాలని విద్యార్థులకి అందిస్తూ రాత మరియు శారీరక పరీక్షల్లో విజయం సాధిస్తున్నామని తెలిపారు. ఇంతటి విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి మరియు సిబ్బందికి ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యున్నత భోధనా ప్రమాణాలతో శిక్షణని అందిస్తూ అన్ని ఆర్మీ ర్యాలీలలో అద్భుత విజయాలు నమోదు చేస్తున్న ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో సైనిక ఉద్యోగాల ఆశావహులు, నిరుద్యోగులు చేరి ఉద్యోగులుగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందం మరియు సిబ్బంది పాల్గొన్నారు

# ముత్యంపేటలో వైభవంగా పోచమ్మ బోనాల పండుగ



మల్యాల, జూన్ 07 (విజన్ ఆంధ్ర):
మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలో గ్రామ దేవత శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల పండుగ అత్యంత వైభవంగా జరిగింది. ఏటా నిర్వహించే ఈ సాంప్రదాయ ఉత్సవానికి గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.?ఉదయం నుంచే మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకుని మంగళహారతులతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో గ్రామంలోని పురవీధులన్నీ కోలాహలంగా మారాయి.?అనంతరం ఆలయంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం (నైవేద్యం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు



# ఆరోగ్యకర జీవనానికి "హ్యాపీ సండే"




**-డిజిటల్ వ్యసనం నుంచి బయటపడాలంటే శారీరక వ్యాయామం అవసరం**

**-రామగుండం మేయర్ మహంకాళి స్వామి**

గోదావరిఖని జూన్-07(విజన్ ఆంధ్ర)
ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు "హ్యాపీ సండే" కార్యక్రమం ఎంతో అవసరమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఆదివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన హ్యాపీ సండే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత మార్చి నెలలో గోదావరి నదిలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించి, అనంతరం క్రీడా పోటీలతో హ్యాపీ సండే కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రజలు డిజిటల్ స్క్రీన్లకు ఎక్కువగా అలవాటు పడటంతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే యోగా, క్రీడలు వంటి కార్యకలాపాలకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు పెరిగి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఇప్పటివరకు మెట్రో నగరాలకు మాత్రమే పరిమితమైన హ్యాపీ సండే కార్యక్రమాన్ని చిన్న పట్టణాలు, నగరాల్లో కూడా ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, నగరంలోని మైదానాల్లో వ్యాయామం, క్రీడల్లో పాల్గొంటున్న వారి సంఖ్య పెరగడం శుభపరిణామమని అన్నారు. మెప్మా సిబ్బంది సహకారంతో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికతో పాటు అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని మేయర్ పేర్కొన్నారు. రామగుండం నగరాన్ని ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా ప్రభుత్వానికి ప్రాధాన్య అంశమని, అందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా యోగా ప్రదర్శనలతో పాటు కబడ్డీ, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ పాల్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, మెప్మా టీఎంసీ మౌనిక, యోగా గురు గణేష్, వ్యాయామ ఉపాధ్యాయులు శోభారాణి, తిరుపతి, దావీద్, సీఓలు, ఆర్పీలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



మల్యాల, జూన్ 07 (విజన్ ఆంధ్ర):
జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ, ఉప ప్రాధాన అర్చకులు చిన్న రాము వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించి, శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ సుపేరెండేంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ పాల్గొన్నారు



# నూరుభాషా దూదేకుల సంఘం అధ్యక్షుడిగా మహ్మద్ సలీమ్ ఏకగ్రీవ ఎన్నిక

మల్యాల, జూన్ 07 (విజన్ ఆంధ్ర):
మల్యాల మండలంలోని రామన్నపేట, మద్దుట్ల పోతారం గ్రామాల నూరుభాషా దూదేకుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సంఘ గౌరవ అధ్యక్షుడు ఒలి మహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు.?సంఘం నూతన అధ్యక్షులుగా మహ్మద్ సలీమ్ (మద్దుట్ల) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.?ఉపాధ్యక్షులు హరిఫ్.ప్రధాన కార్యదర్శి రఫీ.క్యాషియర్ బాష్ బాయ్.సలహాదారులు సాహెబ్ హుస్సేన్, అజారుద్దీన్ కార్యవర్గ సభ్యులు రషీద్, అబ్దుల్లా, రంజాన్, సలీం, అబ్దుల్. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మహ్మద్ సలీమ్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన దూదేకుల సంఘం సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలలోని దూదేకుల బంధువులందరినీ ఏకం చేస్తూ, సంఘం అభివృద్ధికి మరియు వారి సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్లిపూర్ గ్రామ బిజెపి నూతన కార్యవర్గ ఎంపిక



జగిత్యాల ఆర్ సీ జూన్ 07(విజన్ ఆంధ్ర)
అల్లిపూర్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్టీ ఆదేశానుసారం గా నూతన గ్రామ కమిటీ గ్రామ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగడి పరమేశ్వర్, బాలెచంద్రశేఖర్, గొడ్డన్ల రాజశేఖర్, రాయిల్ల మల్లికార్జున్, గెల్లే రమేష్, చిలివేరి శశి, బొజ్జ దేవేందర్, శీలం నాగరాజు, శ్రీరాముల ఆదర్శ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. శక్తి కేంద్రం అధ్యక్షులు గ ఇనుగుర్తి మణికంఠ, శక్తి కేంద్ర ఉపాధ్యక్షులు రాజేందర్, 50 బూతు అధ్యక్షులు పూల రమేష్, 51 అధ్యక్షులు సిరిపురం ఆనంద్, 52 బూత్ అధ్యక్షులు పల్ల రామకృష్ణ,53 అధ్యక్షులు సింగిరెడ్డి సురేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన నాయకులకు గ్రామ బిజెపి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# గిరిజన జీవితాన్ని ఆవిష్కరించిన ఫోటోకు జాతీయ పురస్కారం

**ఒడిశా గిరిజన జీవన చిత్రానికి జాతీయ గుర్తింపు**

**జాతీయ స్థాయిలో మెరిసిన జిలకుంట యువ ఫోటోగ్రాఫర్.... ఇరుకుల్ల వీరేశం**

**ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు**

**ఛాయాచిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న వీరేశం**

**రాష్ట్ర చీఫ్ సెక్రటరీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న వీరేశం**

**ఫోటోగ్రాఫర్ ఇరుకుల్ల వీరేశంకు జాతీయస్థాయి ప్రతిష్టాత్మక అవార్డు**





ఓదెల జూన్ 07,(విజన్ ఆంధ్ర)
పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని జిలకుంట గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ ఇరుకుల్ల వీరేశం మరోసారి జాతీయస్థాయిలో తన ప్రతిభను చాటి ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ లోని మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటిషన్ అండ్ ఎగ్జిబిషన్--2026లో వీరేశం తీసిన ఛాయాచిత్రం తృతీయ బహుమతిని సాధించింది.ఈ సందర్భంగా రూ.20 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు చేతుల మీదుగా స్వీకరించారు.దేశవ్యాప్తంగా కళాకారులు పంపించిన 820 కళాఖండాల్లో జ్యూరీ సభ్యులు ఎంపిక చేసిన 250 ఉత్తమ కళాఖండాలు ప్రదర్శనకు ఎంపిక కాగా,వాటిలో వీరేశం రూపొందించిన ఛాయాచిత్రం ప్రత్యేక గుర్తింపు పొందింది.ఒడిశాలోని గిరిజనుల జీవన విధానాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఛాయాచిత్రానికి ఈ పురస్కారం దక్కింది.ఫోటోగ్రఫీ రంగంలో ఇప్పటికే అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో అనేక పురస్కారాలు అందుకున్న వీరేశం,తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన 5 వ ఎడిషన్ పోటీల్లో కూడా తృతీయ బహుమతి సాధించడం విశేషం.ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్ వీరేశం మాట్లాడుతూ... సాధారణ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తనకు దేశంలోని ప్రముఖ కళాకారులతో పోటీపడి బహుమతి అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఫోటోగ్రఫీ తనకు ప్రాణమని,దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రకృతి అందాలు, పండుగలు,గిరిజనుల జీవన విధానాన్ని చిత్రీకరిస్తున్నానని తెలిపారు.ఒక ఫోటో వెయ్యి భావాలను పలికిస్తుందని పేర్కొంటూ, ఫోటోగ్రాఫర్లకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు.అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, జేఎన్‌ఎఫ్‌ఏయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ ఆనంద్ గడప, చిత్రమయి ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.